క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు ఒంటిద్దు నాగేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో సహా బుధవారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ విజయానికి తమ కుటుంబమంతా పని చేస్తామని ఈ సందర్భంగా నాగేశ్వరరావు తెలిపారు. ఎల్‌బీ పురం సర్పంచ్ తమరాన శ్రీను నాయకులు దొండా రాజా,చప్పా వెంకట అప్పారావు తదితర్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద వివరాలు తెలుసుకున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



కాసులమ్మను అగ్ని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుంటున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాద వివరాలను ప్రభుత్వ విప్ కరణ ధర్మశ్రీ బుధవారం తెలుసుకున్నారు. మండలంలోని ఎల్. శింగవరం గ్రామ మాజీ సర్పంచ్ కరణం కాసులమ్మకు చెందిన ఆరు ఎకరాల్లో జీడిమామిడి తోట రెండు రోజుల కిందట కాలిపోయింది. బుధవారం కాసులమ్మ ఇంటికెళ్లి పరామర్శించిన విప్ ధర్మశ్రీ పంట నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదం వల్ల జరిగిన నష్టంపై విద్యుత్ శాఖ అధికార్లు, ప్రభుత్వం దృష్టికి తీసికెళ్తానన్నారు. నాయకులు జయదేవ్,తమరాన శ్రీను,దొండా రాజా,వెంకటప్పారావు,నాగేశ్వరరావు తదితర్లు పాల్గొన్నారు.

చీడికాడలో హోరెత్తిన ప్రచారం



చీడికాడలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న బూడి రమణమ్మ, పార్టీ శ్రేణులు

చీడికాడ: డిప్యూటీ సీఎం బూడి సతీమణి రమణమ్మ చీడికాడలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఇంటింటా ప్రచారం నిర్వహించి మాడుగుల ఎమ్మెల్యేగా తన కుమార్తె అనురాధ, అనకాపల్లి ఎంపీగా భర్త బూడి ముత్యాలనాయుడును అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్ద మహిళలు ఆమెకు హారతులతో ఆహ్వానించి, పూలవర్షం కురిపించారు. వైఎస్సార్‌సీపీ ప్రచారంతో చీడికాడ హోరెత్తిందింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసి సంక్షేమ పథకాలను వివరించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గొల్లవిల్లి స్వామినాయుడు, ఈర్లె చైతన్య, పరువాడ మహేష్, రామారావు, అప్పారావు, సిమెంట్ నాయుడు, శిరిశోల మహేష్, రెడ్డి బలరాం తదితరులున్నారు.

కార్యదర్శి జీతం నిలుపుదల



హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో చంద్రరావు

మాకవరపాలెం: విధులకు గైర్హాజరైన పంచాయతీ కార్యదర్శి నెల జీతాన్ని ఎంపీడీవో చంద్రరావు నిలుపుదల చేశారు. మండలంలోని పాపయ్యపాలెం సచివాలయాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో కార్యదర్శి విజయ్‌కుమార్ విధులకు హాజరుకాకపోవడంతో నెల జీతం నిలుపుదల చేస్తూ మెమో జారీ చేసినట్టు ఎంపీడీవో చెప్పారు. కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

అయ్యన్నకు ఓటేస్తే అధోగతే

- టీడీపీ మోసపూరిత హామీలు నమ్మొద్దు
- ఎమ్మెల్యే గణేష్
- ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా హారతులు పట్టిన మహిళలు



ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే గణేష్



సన్యాసిపాత్రుడుతో కలిసి ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ 2,3,5,6 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమా శంకర్ గణేష్ బుధవారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అడుగడుగునా హారతులు పట్టి, పూల వర్షం కురిపించారు. గిరగిరా తిరుగుతుంది ఫ్యాన్ పాటకు మహిళా కార్యకర్తలు డ్యాన్స్‌తో ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందాయన్నారు. అందువల్లే మంచి జరిగి ఉంటేనే ఓటు వేయాలని సీఎం కోరారన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. శాంతియుత పాలన కావాలో..అశాంతి పరిపాలన కావాలో ప్రజలు తేల్చుకోవాలని తెలిపారు. ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో రౌడీయిజం, దందాలు, దోపిడీలు లేవన్నారు. 67 ఏళ్లు వచ్చేశాయి, ఇదే చివరి ఎన్నిక అంటున్న అయ్యన్నపాత్రుడుకు పొరపాటున ఓటేస్తే ఆయన కొడుకు రౌడీయిజం, చందాలు, గుండాయిజంతో నియోజకవర్గాన్ని సర్వనాశనం చేస్తారని చెప్పారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఇవే చివరి ఎన్నికలని అనడం అయ్యన్నపాత్రుడుకు పరిపాటిగా మారిందని తెలిపారు. టిడ్కో గృహాలు పూర్తి చేయలేక టీడీపీ చేతులెత్తేస్తే వాటిని పూర్తి చేసి ఇటీవల లబ్ధిదారులకు అందించామన్నారు. 357 మందికి రూపాయికే రూ.10 లక్షలు విలువ చేసే ఇళ్లు అప్పగించామని చెప్పారు. అయ్యన్న పాత్రుడు టిడ్కో కాంట్రాక్టర్‌ను బెదిరించి రూ.10 కోట్లు గుంజుకుని శివపురంలో పెద్ద భవంతి నిర్మించుకున్నారు. మున్సిపాలిటీలో రూ.6 కోట్లతో వైఎస్సార్ ట్యాంక్ బండ్ రోడ్డు నిర్మాణ పనులు 70 శాతం పూర్తి చేశామన్నారు. ఇదే రోడ్డుకు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అయ్యన్నపాత్రుడు రూ.3 కోట్లు జేబులో వేసుకున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలో మంత్రిగా పని చేసిన అయ్యన్నపాత్రుడు ఆరిల్లోవ రోడ్డు విస్తరణకు అటవీ క్లియిరెన్స్ తీసుకురాలేకపోయారని, తాను అటవీ అనుమతులు తీసుకువచ్చానన్నారు. రూ.500 కోట్లతో మాకవరపాలెంలో మెడికల్ కళాశాల నిర్మిస్తున్నామన్నారు. 2014లో ఇచ్చిన 600 హామీలను చంద్రబాబు విస్మరించారని చెప్పారు. ఓటుతో చంద్రబాబు, అయ్యన్నపాత్రుడులకు బుద్ధి చెప్పాలని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, డాక్టర్ లక్ష్మీకాంత్, మాజీ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, కౌన్సిలర్ దాడి కృష్ణవేణి, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, వార్డు ఇన్‌చార్జ్ కణితి అన్నపూర్ణ, కణితి వాసు, డి.వి.కె.సత్యనారాయణ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

నాతవరం: రాజకీయాలకు అతీతంగా ఈ ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు విజయాన్ని చేకూరుస్తాయని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సతీమణి పెట్ల కళావతి అన్నారు. నాతవరం మండలం వల్లంపేటలో



వల్లంపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి పెట్ల కళావతి

బుధవారం ఆమె ప్రచారం చేశారు. గ్రామ పొలిమేరలో ఆమెకు హారతులిచ్చి, స్వాగతం పలికారు. ఈసందర్భంగా కళావతి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే సంక్షేమ పథకాలు రెట్టింపు వస్తాయన్నారు. నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడును భారీ ఎమెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, వల్లంపేట సర్పంచ్ ఇట్టంశెట్టి శ్యామల వల్లంపేట మాజీ సర్పంచ్ సుర్ల యోగీశ్వరుడు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయుకుడు ఇట్టంశెట్టి శ్రీను పార్టీ నేతలు మీడతాన సుధీర్, మిడతాన రాంప్రసాద్, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు మండలంలో గల ఎంపీటీసీలు సర్పంచులు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కస్పా గ్రోయిన్ వద్ద త్వరలో తులసీరావు విగ్రహం

- వడ్డాదిలో కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- 20న చోడవరానికి రానున్న ముఖ్యమంత్రి జగనన్న



వడ్డాదిలో మాట్లాతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: పది గ్రామాలకు చెందిన రైతులకు సాగునీటి వసతి కల్పించిన దివంగత విశాఖ డెయిరీ చైర్మెన్ ఆడారి తులసీరావు విగ్రహాన్ని కస్పా గ్రోయిన్ వద్ద త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. ఇందుకు కార్యకర్తలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు. బుధవారం రాత్రి మేజర్ పంచాయతీ వడ్డాది జంక్షన్‌లో కోటి వరహాలు కాంప్లెక్స్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డాది, చిన అప్పనపాలెం, పోలెపల్లి, గౌరీపట్నం, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, ఎల్‌బీ పురం తదితర 10 గ్రామాలకు చెందిన 1,600 ఎకరాలకు సాగు నీరు అందించే గ్రోయిన్ నిర్మాణానికి అడిగిన వెంటనే సుమారు రూ.70 లక్షలు నిధులు సమకూర్చిన తులసీరావు సేవలు అభినందనీయమన్నారు. రైతులకు సాగునీరు అందించిన తులసీరావు విగ్రహాన్ని కస్పా గ్రోయిన్ వద్ద నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే మేమంతా సిద్ధం బస్సుయాత్రలో భాగంగా ఈ నెల 20వ తేదీన 3 గంటలకు చోడవరం విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు కార్యకర్తలంతా కలిసి రావాలన్నారు. స్థానికంగా ఉన్న వడ్డాదికి చెందిన టీడీపీ నాయకుడు బత్తుల తాతయ్యబాబుకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని నాల్గున్నరేళ్లు టీడీపీ నాయకులు వాడుకుని ఆఖరి సమయంలో రాజుకు టికెట్ ఇచ్చి ఆయనను మోసం చేశారన్నారు. తనను రెండోవసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలించేలా ప్రతి ఒక్కరూ సమిష్టిగా పనిచేయాలన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావు,నాయకులు ఎస్.ఎస్.ఎన్. రెడ్డి,దొండా నారాయణమూర్తి, శంకరావు,జోజి, కోరుకొండ రమణ, ఇంటి అప్పారావు తదితర్లు పాల్గొన్నారు.

పార్టీ మారడం అవాస్తవం

మాకవరపాలెం: పార్టీ మారుతున్నట్టు టీడీపీ నేతలు చేసిన ప్రచారంలో వాస్తవం లేదని మండలంలోని తామరం పంచాయతీ వార్డు సభ్యురాలు వేముల పూడి చిలకమ్మ తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ మంగళవారం తన భర్తకు స్థానిక టీడీపీ నేతలు అయ్యన్న తనయుడు రాజేష్‌తో బలవంతంగా టీడీపీ కండువా వేసినట్టు ఆరోపించారు. తాను కూడా టీడీపీలో చేరుతున్నట్టు ప్రచారం చేశారన్నారు. తాము వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని స్పష్టం చేశారు. పార్టీమారే ఆలోచనే తమకు లేదన్నారు. తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు.

ఉపాధి వేతనదారులకు వంద రోజులు పనికల్పించాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రరావు

మాకవరపాలెం: ఉపాధి హామీ పథకం వేతనదారులకు వంద రోజుల పాటు పని కల్పించేందుకు ఉపాధి సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రరావు ఆదేశించారు. మండలంలోని పైడిపాల, బూరుగుపాలెం, తూటిపాలలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మస్తర్లను తనిఖీ చేసి, కూలీలతో మాట్లాడారు. పనిప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.

ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి సత్యవాణి

మాడుగుల: ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణి తెలిపారు. స్థానిక ఆర్‌సీఎం బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గంలో కోనాం, తాటి పర్తిలలో రెండు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నిరంతరం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. మద్యం, నగదు పంపిణీ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎన్నికలు డీటీ ఎం.రాజా, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి చేరిన ట్రస్టుబోర్డు చైర్మన్ శంకర్



కందర్ప శంకర్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

చోడవరం: స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ట్రస్టుబోర్డు చైర్మన్ కందర్ప శంకర్ వైఎస్సార్‌సీపీలో బుధవారం సాయంత్రం చేరారు. ఈయన తాజాగా టీడీపీలో చేరారు. మళ్లీ తాను చేసిన తప్పును తెలుసుకొని సొంతపార్టీ అయిన వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు కందర్ప శంకర్‌చెప్పారు. ఆయనకు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషిచేస్తానని శంకర్ చెప్పారు.

అవినీతికి కేరాఫ్ అడ్రస్ గేదెల

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగులాపల్లి రాంబాబు

చోడవరం: అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదేల సత్యనారాయణ వైఎస్సార్‌సీపీని విమర్శిస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగులాపల్లి రాంబాబు హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019లో తెలుగుదేశం పార్టీ ఓడిపోతే స్వార్థ ఆలోచనతో రియలస్టేట్ వ్యాపారం కోసం వైఎస్సార్‌సీపీలో చేరి, ఇక్కడ అన్ని విధాలుగా లబ్ధిపొంది ఇప్పుడు డబ్బులకు కక్కుర్తిపడి పార్టీ మారిపోయారని విమర్శించారు. ఎమ్మెల్యే ధర్మశ్రీకి కుటుంబ సభ్యులు ప్రచారం చేయడంపై విమర్శించడం సిగ్గుచేటన్నారు. డబ్బులకు అమ్ముడుపోయి, కొందరికి డబ్బులు ఎర చూపి పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహిస్తూ బ్రోకర్‌గా పనిచేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ధర్మశ్రీని, వైఎస్సార్‌సీపీని విమర్శిస్తే సహించేది లేదని చెప్పారు. ఒకప్పుడు ఆడారి తులసీరావు పెట్టిన భిక్షతో బతికి ఇప్పుడు డెయిరీ డైరెక్టర్‌గా ఎన్నో కబ్జాలు చేసిన సత్యనారాయణను జనం నమ్మరని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దన్నిన వెంకట్రావు, పతివాడ అప్పారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గంలో 57 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

మాడుగుల రూరల్: మాడుగుల నియోజకవర్గంలో 57 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్టు సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్థానిక తహసీల్దారు టి. సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మాడుగుల మండలంలో 24 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్టు చెప్పారు. ఎం.కోడూరు, మాడుగుల, ఎం.కోటపాడు, ఎల్.పోన్నవోలు, కె.జె.పురం, వీరవల్లి అగ్రహారం గ్రామాల్లో ఈ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి, మండలాల్లో 33 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్టు చెప్పారు.

వీధి కుక్కల దాడిలో నాలుగు మేక పిల్లల మృతి



వెంకటరాజుపురంలో వీధి కుక్కల దాడిలో మృతి చెందిన మేక పిల్లలు

దేవరాపల్లి: మండలంలోని వెంకటరాజుపురంలో వీధి కుక్కల దాడిలో బుధవారం నాలుగు మేక పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన నొడగల పరదేశి, గోకాడ గురువులు, అల్లిఖాన్ బాబురావులకు చెందిన మేక పిల్లలు మృతి చెందడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో వీధి కుక్కల దాడిలో సుమారు 15 మేక పిల్లలు మృత్యువాత పడ్డాయని గ్రామస్తులు తెలిపారు. తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఘనంగా పెద పైడితల్లమ్మ తీర్థం



పెద పైడితల్లమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : మల్లంపాలెం గ్రామ దేవత పెద పైడితల్లమ్మ అమ్మవారి తీర్థాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. బంధువులు, స్నేహితుల రాకతో గ్రామం సందడిగా మారింది. సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీ నిర్వహించారు.

సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ



మాట్లాడుతున్న మాడుగుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ



సమావేశానికి హాజరైన కార్యకర్తలు అభిమానులు

మాడుగుల రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకే పార్టీకి శ్రీరామరక్షని, అవే గెలిపిస్తాయని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్ల అనురాధ తెలిపారు. కె.జె.పురంలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి కార్యకర్త సైనికుడిల్లా పనిచేసి మాడుగుల కోటపై ముచ్చటగా మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేయడానికి కృషి చేయాలన్నారు. తన తండ్రిని బూడి ముత్యాలనాయుడును ఆదరించినట్టే తనను కూడా ఆదరించి గెలిపించాలని ఆమె కోరారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు కుటిల రాజకీయాలతో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇచ్చిందని, ప్రధానంగా మహిళలు సంక్షేమానికి ఎంతో కృషి చేసిందన్నారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా తన తండ్రి బూడి ముత్యాలునాయుడును గెలిపించాలని కోరారు. ఈ సమావేశానికి స్థానిక పీఏసీఎస్ చైర్మన్ కాళ్ల రాము అధ్యక్షత వహించారు. స్థానిక ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మార్కెట్టు కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, సర్పంచ్ జామి రమణబాబు, ఏఎంసీ డైరెక్టరు భీశెట్టి జగ్గప్పారావు, పాలసొసైటీ అధ్యక్షుడు యల్లపు శ్రీను, సుగర్స్ మాజీ డైరెక్టరు యల్లపు రాము, స్థానిక నాయకులు మళ్ల కన్నబాబు తదితరులు మాట్లాడారు. సమావేశం అనంతరం అనురాధను స్థానిక నాయకులు, మహిళలు ఘనంగా సన్మానించారు.

గ్రామ వలంటీర్ల రాజీనామా



రాజీనామా చేసిన కొవ్వూరు వలంటీర్లు



రాజీనామా పత్రాలను ఈవోపీఆర్డీవో నూకరాజుకు అందజేస్తున్న జె.పి.అగ్రహారం వలంటీర్లు



రాజీనామా పత్రాలను కార్యదర్శి దామోదర్‌కు అందజేస్తున్న లక్ష్మీపురం వలంటీర్లు



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న సింగవరం వలంటీర్లు

రోలుగుంట: మండలంలోని రెండు పంచాయతీలకు చెందిన 18 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. కొవ్వూరు పంచాయతీలో 12 మంది వలంటీర్లు పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మికి, జె.పి.అగ్రహారంలో అరుగురు వలంటీర్లు ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీ ఎస్.నూకరాజుకు రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకు ఉపాధి కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డిని మరొకసారి ముఖ్యమంత్రిని చేసుకుని రుణం తీర్చుకుంటామని, ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీని, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు.

మాకవరపాలెం: మండలంలోని రెండు సచివాలయాల పరిధిలోని తొమ్మిది మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. జంగాలపల్లి, గిడుతూరు సచివాలయాల పరిధిలో తొమ్మిది మంది వలంటీర్లు ఎంపీడీవో చంద్రరావుకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

చోడవరం: లక్ష్మీపురం గ్రామ సచివాలయం పరిధిలోని 15 మంది గ్రామ వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో సత్యమణి, పంచాయతీ కార్యదర్శి ఆర్.దామోదర్‌రావు అందజేశారు.

చీడికాడ: జైతవరం సచివాలయం పరిధిలో గల బి.సింగవరం గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో ఉమామహేశ్వరికి అందజేశారు. రాజీనామా చేసిన వలంటీర్లు దాడి దివ్య, పీలా మహాలక్ష్మీనాయుడు,కొణతాల సింధు,పంచదార్ల భువనేశ్వరి,మళ్లా జయలక్ష్మీలు మాట్లాడుతూ వృద్ధులు,వితంతువులు, దివ్యాంగులకు అనేక సేవలు అందించామని, టీడీపీ కుట్రల కారణంగా ఇప్పుడు సేవలకు దూరమయ్యామని చెప్పారు.

హోమ్ ఓటింగ్‌కు వృద్ధులు, దివ్యాంగులను గుర్తించాలి

దేవరాపల్లి: దివ్యాంగులు, 85 సంవత్సరాల పైబడిన వయసు గల వృద్ధులకు ఇంటివద్దే ఓటు వేసే అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, అలాంటి వారిని గుర్తించాలని స్థానిక తహసీల్దార్, ఎన్నికల సహాయ అధికారి జి.లక్ష్మీనారాయణ సూచించారు. ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేందుకు వృద్ధులు, దివ్యాంగుల నుంచి 12డి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్‌వోలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా ఎన్నికల కమిషన్ తీసుకువచ్చిన ఓట్ ఫర్ హోమ్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమావళిని అనుసరించి విధులు నిర్వర్తించాలని సూచించారు. 18 ఏళ్ల వయసు నిండిన యువతీయువకుల నుంచి ఓటు హక్కు కోసం ఫారం-6 దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ సమర్థంగా పని చేయాలన్నారు.

మాజీ సర్పంచ్‌కు అనురాధ పరామర్శ



సత్యవమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అనూరాధ

చీడికాడ: మండలంలోని తునివలస మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత పడాల అప్పలనాయడు మాతృమూర్తి సత్యవమ్మ(72) బుధవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాడుగుల వైఎస్సాసీపీ అభ్యర్థి ఈర్లె అనూరాధ తునివలస వెళ్లి సత్యవమ్మ మృతదేహంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పించి, అప్పలనాయుడును పరామర్శించారు. ఆమె వెంట ఎంపీపీ కురచా జయమ్మ,నారాయణ మూర్తి, చీడికాడ, దేవరాపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు,బురే బాబురావు,వైస్‌ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, పార్టీ నేతలు స్వామినాయుడు, పాతాళం చిన్నంనాయుడు తదితరులున్నారు.

నాలుగు గ్రామాల్లో ఉపాధి పనుల పరిశీలన



జన్నవరంలో ఉపాధి మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: మండలంలోని జన్నవరం, జగ్గంపేట, జె.గూడెం, గునుపూడి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఎంపీడీవో రాంబాబు పరిశీలించారు. ఉపాధి వేతనదారులకు వేస్తున్న మస్తర్ వివరాలను, రికార్డులను తనిఖీ చేశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి వేతనదారుడు 100 రోజుల పనిదినాలను పూర్తి చేయాలని సూచించారు. రోజువారీ వేతనాన్ని రూ.300 పెంచినట్టు చెప్పారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం వేగంగా పనులకు హాజరుకావాలని, వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏపీవో చిన్నారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.